క్లుప్తంగా

## పోటీ పరీక్షల పుస్తకాల వితరణ



గ్రంథాలయాధికారి శివప్రసాద్‌కు పుస్తకాలను అందిస్తున్న దాత వెంకటేశ్వర్లు

**తిరుపతి అర్బన్:** తిరుపతి అన్నమయ్య సర్కిల్ సమీపంలోని గ్రేడ్–1 గ్రంథాలయానికి పోటీ పరీక్షలకు చెందిన పుస్తకాలను విరాళంగా ఇచ్చారు. ఆదివారం చంద్రగిరి మండలం బుచ్చినాయుడుపల్లికి చెందిన వెంకటేశ్వర్లు నాయుడు గ్రూప్–2, డీఎస్సీ వంటి పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలను అందజేశారు. ఈ మేరకు పుస్తకాలను నిరుద్యోగుల కోసం గ్రంథాలయంలో సోమవారం నుంచి అందుబాటులో ఉంచుతామని గ్రంథాలయాధికారి శివప్రసాద్ వెల్లడించారు. పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## మహాధర్నాను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న రైతుసంఘం నేతలు

**తిరుపతి కల్చరల్:** రైతు సంఘాల సమన్వయ సమితి, కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు చేపట్టే మహా ధర్నాకు రైతులు, కార్మికులు, ప్రజా సంఘాల నేతలు పాల్గొని జయప్రదం చేయాలని రైతు సంఘ నేతలు రామానాయుడు, మాంగాటి గోపాల్ రెడ్డి, హేమలత పిలుపునిచ్చారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పోరాటాలతో ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం కాల రాస్తోందన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజా హక్కుల సాధనే లక్ష్యంగా దేశ వ్యాప్తంగా 530 జిల్లాల్లో ఆయా జిల్లా కార్యాలయాల వద్ద మహా ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా రైతులు, కార్మిక, ప్రజా సమస్యలు పరిష్కరించడంతో పాటు ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తక్షణం విరమించుకుని ప్రజా సంక్షేమం దిశగా పాలకులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద చేపట్టే మహా ధర్నాకు జిల్లాలోని కార్మిక, రైతాంగ, ప్రజా సంఘాల నేతలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ, సీఐటీయూసీ నేతలు రాధాక్రిష్ణ, బాలసుబ్రమణ్యం, జయచంద్ర, ఐఎఫ్‌టీయూ నేత భారతి, ఆర్.వెంకయ్య పాల్గొన్నారు.

## బెల్టు షాప్ నిర్వాహకుడి అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

**చంద్రగిరి:** నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు సీఐ ఫణీంద్ర తెలిపారు. మండల పరిధిలోని పనపాకం గ్రామానికి చెందిన గంగాధరం గత కొన్నాళ్లుగా నిబంధనలకు విరుద్ధంగా బెల్టు దుకాణం నిర్వహిస్తున్నట్లు అధికారులకు సమాచారం అందింది. ఈ మేరకు ఆదివారం సీఐ ఫణీంద్ర ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎస్ఐ స్వామినాథన్ బృందం దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో 8 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని గంగాధరంను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అనధికారిక గొలుసు దుకాణాలను నిషేధించినట్లు చెప్పారు. గ్రామాల్లో ఎక్కడైనా బెల్టు దుకాణాలను నిర్వహిస్తుంటే ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని సీఐ తెలిపారు.

## అనారోగ్యంతో వ్యక్తి మృతి



మృతి చెందిన ప్రమోద్

**చంద్రగిరి(తిరుచానూరు):** అనారోగ్యంతో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం మంగళం పంచాయతీ పరిధిలో వెలుగు చూసింది. కేరళ రాష్ట్రానికి చెందిన ప్రమోద్ (ప్రభు) అనే వ్యక్తి కొన్నేళ్ల క్రితం మంగళం ప్రాంతానికి వచ్చి ఇక్కడే స్థానికంగా చిన్నచిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంగా ఉండడంతో ఆదివారం ఉదయం మృతి చెందాడు. అయినవారు ఎవరూ లేకపోవడంతో స్థానికంగా ఉన్న యువత, ప్రమోద్ పని చేసిన యజమాని మధు అంత్యక్రియలకు నగదు సమీకరించి గోవింద ధామంలో మృతదేహాన్ని ఖననం చేశారు. తిరుచానూరు పోలీసులు ప్రమోద్ మృతి చెందిన ప్రాంతాన్ని పరిశీలించారు.

# బోరుమంటున్న బస్టాండ్!

**తిరుపతి బస్టాండ్‌లో నీటి కష్టాలు**

- నాలుగు బోర్లున్నా.. పనిచేసేది రెండే
- కార్పొరేషన్ నీళ్లున్నా వాడుకోని పరిస్థితి
- ఏడాదికి నీటి కోసమే రూ.20.14 లక్షలు
- నాలుగు బస్టాండ్లకు ఐదు చోట్లే తాగునీటి కొళాయిలు
- పల్లె వెలుగు బస్టాండ్‌లో కనిపించని కొళాయిలు
- ఇక్కట్లు పడుతున్న ప్రయాణికులు



తిరుపతి బస్టాండ్



ట్యాంకర్ల ద్వారా బస్టాండ్‌లోని సంపులో నీటిని నింపుతున్న వైనం

**తిరుపతి అర్బన్:** తిరుపతి బస్టాండ్ 13 ఎకరాల విస్తీర్ణంలో ఏడు దశాబ్దాల క్రితం ఏర్పాటైంది. ఇందులో శ్రీహరి, శ్రీనివాస, ఏడుకొండలు, పల్లె వెలుగు పేరుతో నాలుగు బస్టాండ్లు ఉన్నాయి. 64 ప్లాట్‌ఫాంలతో నడుస్తోంది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలతోపాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి తిరుపతికి ఆర్టీసీ సర్వీసులు వచ్చి పోతుంటాయి. రోజుకు 3,500కు పైగా ట్రిప్పులు తిరుగుతుంటాయి. 80కి పైగా వ్యాపార దుకాణాలున్నాయి. జిల్లా కార్గో పాయింట్ ఉంది. రోజూ ఈ బస్టాండ్ ఆధారంగా 1.20 లక్షల మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే తాగునీటి సమస్య మాత్రం తప్పడం లేదు. ఓ వైపు బోర్లు ఉన్నా.. మరోవైపు కార్పొరేషన్ నీరు ఉన్నప్పటికీ ఏడాదిలో రూ.20.14 లక్షల వరకు ఖర్చు పెట్టి నీటిని కొనుగోలు చేస్తున్నారు. కమీషన్ల కోసం నీటిని కొనుగోలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**నాలుగు బోర్లున్నా..**

బస్టాండ్‌కు నీటి సౌకర్యాలను కల్పించడంలో ఆర్టీసీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బస్టాండ్‌కు సంబంధించి నాలుగు బోర్లు ఉన్నాయి. అయితే రెండు బోర్లు పూర్తిగా పనిచేయడం లేదు. మిగిలిన రెండు బోర్లు ఎప్పుడు పనిచేస్తాయో.. ఎప్పుడు చేయవో తెలియని దుస్థితి. అయినా వాటిని మరమ్మతులు చేయించి నిత్యం అందుబాటులో ఉంచుకుందామనే శ్రద్ధ ఆర్టీసీలో ఎక్కడా కనిపించడం లేదు. కార్పొరేషన్ నీటిని కొళాయిల ద్వారా బస్టాండ్‌కు ఏర్పాటు చేశారు. అయినా ఆర్టీసీ ఉద్యోగులు వాటిని సద్వినియోగం చేసుకోవడంలేదు.

**నీటికే రోజుకు రూ.5,520**

బస్టాండ్‌లో నీళ్లు లేవంటూ రోజుకు 20 ట్యాంక్‌లను సరఫరా చేసేలా టెండర్లు ఇచ్చారు. ఒక ట్యాంక్ రూ.287 చొప్పున రోజుకు 20 ట్యాంకులకు రూ.5,520 చెల్లిస్తున్నారు. ఏడాదికి రూ.20.14 లక్షలు ఖర్చు చేస్తున్నారు. బస్టాండ్ పరిధిలో మూడు సంపులు ఉన్నాయి. ట్యాంక్‌ల ద్వారా వాటిని భర్తీ చేస్తుంటారు. మరమ్మతుల్లో ఉన్న బోర్లు రిపేర్లు చేయడానికి రూ.2 లక్షలు ఖర్చు చేస్తే సరిపోతుంది. బోర్లు రిపేరు చేయడానికి ఓపిక, సమయం లేక నీటి కోసం టెండర్లు ఆహ్వానించి అప్పగించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

**ఆర్వో ప్లాంట్స్ అంతంత మాత్రమే**

స్వచ్ఛమైన నీటిని ప్రయాణికులకు అందించడానికి టీటీడీ మూడు ఆర్వో ప్లాంట్స్‌ను విరాళంగా ఇచ్చింది. అవి అంతంత మాత్రమే పనిచేస్తున్నాయి. వర్తక సంఘం అసోసియేషన్ వారు ఒక ఆర్వో ప్లాంట్‌ను బస్టాండ్‌కు విరాళంగా ఇచ్చారు. అయితే అది పనిచేయడం లేదు.

**నాలుగు బస్టాండ్లలో ఐదు చోట్ల కొళాయిలు**

నాలుగు బస్టాండ్లకు కేవలం 5 చోట్ల తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేశారు. ఆ కొళాయిలు తూతూ మంత్రంగానే నడుస్తున్నాయి. పల్లె వెలుగు బస్టాండ్‌లో తాగునీటి కొళాయిని ఏర్పాటు చేయలేదు. ఒక్కో బస్టాండ్‌లో ఐదు చోట్ల కొళాయిలు ఏర్పాటు చేయాల్సి ఉంది. నాలుగు బస్టాండ్లలో కలిపి 20 చోట్ల కొళాయిల అవసరం ఉండగా.. అధికారులు ఆదిశగా చర్యలు చేపట్టలేదు.



నామమాత్రంగా తాగునీటి కొళాయి

**ఇంత అధ్వానమా?**



బస్టాండ్‌కు ఐదుచోట్ల మాత్రమే తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేయడం ఎంటీ?. ఒక్కో బస్టాండ్‌కు కనీసం మూడు, నాలుగు చోట్ల కొళాయిలు ఏర్పాటు చేయొచ్చు. పల్లెవెలుగు బస్టాండ్‌లో తాగునీటి కొళాయి లేదు.

–అంకయ్య, తిరుపతి

**మార్పులు చేయాలి**



ప్రస్తుతం 1.20 లక్షల మందికి పైగా తిరుపతి బస్టాండ్ నుంచి రోజు జర్నీ చేస్తుంటే తాగునీటి వసతులు ఎలా ఉండాలి?. మీ ఇంట్లో బోరు మరమ్మతులకు గురైతే దాన్ని బాగుచేయరా. బస్టాండ్‌లో బోర్లు మరమ్మతులకు గురైతే పట్టించుకోరా..?. కనీసం కార్పొరేషన్ నీటినైనా ఏర్పాటు చేయొచ్చుకదా..? కమీషన్లకు కక్కుర్తిపడి ఇలా నీటిని కొనుగోలు చేస్తునఅనరు.

– గండికోట వెంకటేష్, తిరుపతి

**బోర్లు మరమ్మతులు చేయిస్తాం**



బస్టాండ్‌లో నాలుగు బోర్లకు గాను రెండు మాత్రమే పనిచేస్తున్నాయి. మిగిలిన రెండింటిని మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తాం. కార్పొరేషన్ నీటిని పూర్తిగా సద్వినియోగం చేసుకునే దిశగా చర్యలు చేపడుతాం.

– రామచంద్రనాయుడు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, తిరుపతి బస్టాండ్

## శ్రీవారి సేవలో ప్రముఖులు

**తిరుమల:** తిరుమల శ్రీవారిని తమిళ రచయిత శోభచంద్రశేఖర్ (సినీనటుడు విజయ్ తల్లి), రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్ రెడ్డి, తెలంగాణ మక్తల్ నియోజకవర్గ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

## ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



**చంద్రగిరి(తిరుచానూరు):** తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా తిరుపతికి చెందిన త్రినేత్ర డ్యాన్స్ అకాడమీ, శ్రీనటరాజ డ్యాన్స్ అకాడమీ, నృత్య ప్రియ డ్యాన్స్ అకాడమీ, కల్యాణి డ్యాన్స్ అకాడమీ సంయుక్తంగా కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలు ఇచ్చారు. ఇందులో భాగంగా గణేష కౌత్వం, గణనాయక, నాట్య గణపతి, భో శంభో, చంద్ర చూడశివ శంకర వంటి పాటలకు కళాకారులు లలిత, లక్ష్మీ చరిత, చార్వి, దీపిక, పావని, సాత్విక, తన్మయి, ఎలన్ రాజ్, జయంత్, రూపశ్రీ అద్భుత ప్రదర్శన ఇచ్చారు. పాటకు తగిన హావభావాలు, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కళాకారులను ఏఓ. ఖాదర్‌వల్లీతో పాటు నిర్వాహకులు సత్కరించి, బహుమతులను ప్రదానం చేశారు.



కళా ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

## క్రీడలతో మానసిక ఉల్లాసం

**తిరుపతి సిటీ:** మానసిక ఉల్లాసం, ఒత్తిడిని జయించడంలో క్రీడలు ప్రధాన భూమిక పోషిస్తాయని ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతినాయుడు తెలిపారు. ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్వీయూ స్టేడియం వేదికగా జరిగిన గ్రామోత్సవ క్రీడలను ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామోత్సవ క్రీడలను నిర్వహించడం ద్వారా మానసిక ఉల్లాసంతో ఒత్తిడి నుంచి ప్రజలు బయటపడతారనే విశ్వాసం వ్యక్తం చేశారు. ఇషా ఫౌండేషన్ వారు గ్రామోత్సవం పేరిట ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇషా ఫౌండేషన్ తిరుపతి ప్రాంత కన్వీనర్ సైకియాట్రిస్ట్ డాక్టర్ కిషోర్ కుమార్ మాట్లాడుతూ గ్రామోత్సవ క్రీడా కార్యక్రమాలతో గ్రామాల్లో నూతన ఉత్సాహం తీసుకురావడమే తమ ఫౌండేషన్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ శివశంకర్ రెడ్డి, ఏపీ టూరిజం రీజినల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, సీఐ రామయ్య, తిరుపతి పరిసర ప్రాంతాల గ్రామీణ మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న గ్రామీణ మహిళలు



ప్రసంగిస్తున్న రిజిస్ట్రార్ భూపతినాయుడు

## ప్రేక్షకుల ఆదరణ మరువలేనిది

**తిరుపతి కల్చరల్:** గల్లా అశోక్ హీరోగా నటించిన దేవకీ నందన వాసుదేవ చిత్రానికి ప్రజల నుంచి విశేష స్పందన రావడం చూస్తుంటే చాలా సంతోషంగా ఉందని అమరాజా సంస్థ చైర్మన్, మాజీ ఎంపీ గల్లా జయదేవ్ తెలిపారు. ఆదివారం ఆయన గ్రూప్ థియేటర్‌లో విజయవంతంగా ప్రదర్శిస్తున్న దేవకీ నందన వాసుదేవ చిత్రాన్ని చిత్రం హీరో గల్లా అశోక్‌తో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా థియేటర్ వద్ద హీరో గల్లా అశోక్‌కు అభిమానులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మాజీ ఎంపీ మాట్లాడుతూ తమ చిత్రానికి ప్రేక్షకుల నుంచి వస్తున్న ఆదరణ మరువలేనిదన్నారు. అనంతరం చిత్రం హీరో గల్లా అశోక్ మాట్లాడుతూ తాను నటించిన చిత్రాన్ని ఆదరిస్తూ విజయపథంలో నడుపుతున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో సిద్ధార్థ గల్లా, హర్ష గొరినేని, నరసింహనాయుడు, బాలకృష్ణారెడ్డి, ఎంఆర్‌సీ రెడ్డి, మునినాదం, బడి సుధాయాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హీరో గల్లా అశోక్

## గుడిమల్లంలో స్వామీజీలు

**రేణిగుంట(ఏర్పేడు) :** మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వరాలయాన్ని ఆదివారం రాత్రి తమిళనాడు తిరుమంగళంకు చెందిన చిదంబరేశ్వర తిరుమఠం స్వామీజీలు అయ్యర్ గణేష్ స్వామి, వెంకటరామన్‌స్వామి అయ్యర్, శివ అగ్ర అయ్యర్, అంబిలి స్వామి దర్శించుకున్నారు. వారికి ఆలయ పెద్దలు పూర్ణకుంభ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలను అందజేశారు. చోళుల కాలం నాటి అతిపురాతన శైవక్షేత్రమైన గుడిమల్లం ఆలయ శిల్ప సౌందర్యాన్ని వారు కొనియాడారు.



గుడిమల్లం ఆలయాన్ని సందర్శించిన చిదంబరేశ్వర తిరుమఠం స్వామీజీలు

## రాష్ట్ర స్థాయి పోటీల్లో జ్యోత్స్న ప్రతిభ



జ్ఞాపిక అందుకుంటున్న జ్యోత్స్న

**తిరుపతి సిటీ :** సత్యసాయిబాబా జయంతిని పురస్కరించుకుని శ్రీ సత్యసాయి సేవా ఆర్గనైజేషన్ వారు శనివారం రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో వెటర్నరీ కళాశాల బీవీఎస్సీ విద్యార్థిని జ్యోత్స్న ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. సత్యసాయిబాబా ట్రస్ట్ నిర్వాహకులు ఆమెకు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందించారు. కళాశాల అసోసియట్ డీన్ జగపతిరామయ్య అభినందించారు.

## తూనికలు, కొలతల్లో తేడాలుంటే కేసులు

**బుచ్చినాయుడుకండ్రిగ :** దుకాణాల్లో తూనికలు, కొలతల్లో తేడాలుంటే కేసులు నమోదు చేస్తామని తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వర్ తెలిపారు. ఆదివారం బుచ్చినాయుడు కండ్రిగలోని దుకాణాల్లోని తూనికలు, కొలతలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తూనికలు, కొలతలల్లో దుకాణ యజమానులు మోసానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఏటా తూనికలకు ముద్రలు వేయించుకోవాలని, లేకుంటే జరిమానా తప్పదన్నారు. ఇందులోభాగంగా పలు దుకాణ యజమానులకు జరిమానా విధించారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**తిరుపతి తుడా:** తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో «ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక» (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నట్లు కమిషనర్ మౌర్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ స్థానిక సమస్యలపై అర్జీలు అందించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని పట్టణప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## వరద బాధితులకు ఆర్థికసాయం అందజేత



విరాళం చెక్‌ను సీఎం చంద్రబాబుకు అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

**తిరుపతి కల్చరల్:** విజయవాడ వరద బాధితుల సహాయం నిమిత్తం ఆంధ్రప్రదేశ్ హోటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.25 లక్షల ఆర్థిక సాయం అందించారు. ఈ మొత్తాన్ని చెక్ రూపంలో ఆదివారం సీఎం చంద్రబాబుకు అందజేశారు. ఆర్థిక సాయం అందించిన వారిలో ఏపీ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.వి.స్వామి, కార్యదర్శి నాగరాజు, కోశాధికారి పూర్ణచంద్, జిల్లా అధ్యక్షుడు చిల్లీస్ అంజి, ఇతర సభ్యులు ఉన్నారు.

## ఉత్తమ ఎన్‌సీసీ ఆఫీసర్‌గా భారతి



అవార్డు అందుకుంటున్న భారతి

**తిరుపతి ఎడ్యుకేషన్ :** తిరుపతిలోని ప్రభు త్వ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని సి.భారతికి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఎన్‌సీసీ ఆఫీసర్ అవార్డు లభించింది. ఎన్‌సీసీ డే సందర్భంగా ఆదివారం హైదరాబాదులో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వీఎం రెడ్డి చేతుల మీదుగా ఆమె అవార్డు అందుకున్నారు.

## నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

**శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి నాయుడుపేటకు చెందిన పెనగలూరు లీలావతి పేరు మీద కుటుంబ సభ్యులు సుబ్బరామిరెడ్డి, వెంకట కృష్ణారెడ్డి, కృష్ణ మోహన్‌రెడ్డి, విష్ణు మాధవ్ ఆదివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఈఓ. బాపిరెడ్డి స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు వారిని ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా ఆకాశదీపం



**శ్రీకాళహస్తి:** జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం శాస్త్రోక్తంగా ఆకాశ దీపం వెలిగించారు. కార్తీక మాసం సందర్భంగా నిత్యం ఆకాశదీపం వెలిగించిచడం ఆనవాయితీ. అందులో భాగంగా ఆలయంలో ఊంజల్‌సేవ మండపం వద్ద ఏర్పాటు తేసిన కార్తీక దీపానికి పూజలు చేశారు. అనంతరం స్థూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

## ఘనంగా కార్తీక వన మహోత్సవం





ప్రవచనం చేస్తున్న సంస్కృతి వర్సిటీ కులపతి రాణి సదాశివమూర్తి, కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

**తిరుపతి కల్చరల్:** కార్తీక మాసాన్ని పురస్కరించుకుని తిరుపతి బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో ఆదివారం త్యాగరాజ మండపంలో కార్తీక వన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత శివ కేశవలకు పూజ అభిషేకం చేపట్టారు. అలాగే తులసి దామోదర పూజ, తులసి, ఉసిరి చెట్టుకు పూజలు నిర్వహించారు. అనంతరం అనంతరం కార్తీక మహోత్సవం విశేషాలపై డాక్టర్ తనూజ విష్ణువర్ధన్ ప్రవచనాలు చేశారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సంస్కృత వర్సిటీ కులపతి రాణి సదాశివ మూర్తి మాట్లాడుతూ కార్తీక మాసం హిందువులకు పవిత్రమైందని, కార్తీక వన సమారాధన వంటి కార్యక్రమాలు సమాజాన్ని ఒకటి చేయడంతో పాటు సమాజ అభివృద్ధికి దోహద పడతాయన్నారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సమాజం డిసెంబర్ 13, 14, 15 తేదీల్లో జరుగనున్న వేద విద్వత్ సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అలాగే ఫిబ్రవరి 16న చేపట్టనున్న వివాహ పరిచయ వేదిక వివరాలను సమాజ పెద్దలు తెలియజేశారు. కార్యక్రమంలో తిరుపతి బ్రాహ్మణ సమాజం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేఆర్ వెంకటాచలం, కొత్తపల్లి అజయ్‌కుమార్, సింగరాజు ప్రభాకర్, డాక్టర్ చక్రవర్తి రాఘవన్, డాక్టర్ దక్షిణామూర్తి, డాక్టర్ నరసింహాచార్య, వేదం హరిప్రసాద్, భీమాస్ అశోక్, రవికుమార్, నాగరాజు, రామశర్మ, గౌరీశంకర్, మహేష్, పట్టాభి రామారావు, శ్రీనివాస్, వసంతకుమార్, సంధ్యారాణి, విజయలక్ష్మి, బ్రాహ్మణ కుటుంబీకులు పాల్గొన్నారు.

## అన్నమయ్య కీర్తనలు..సమాజ మార్గదర్శకాలు





మాట్లాడుతున్న పోకల అశోక్‌కుమార్, తాళ్లపాక హరినారాయణాచార్యులను సత్కరిస్తున్న వక్తలు

**తిరుపతి కల్చరల్:** అన్నమయ్య కీర్తనలు ఆధ్యాత్మిక భావాలకు మార్గదర్శకాలే కాకుండా, సమసమాజ స్థాపనకు దోహద పడతాయని, సంస్కృతి, సంప్రదాయ కళలు ఎక్కడ వికాసంతో విరాజిల్లుతాయో అక్కడ సుభిక్షత ఉంటుందని, పలువురు వక్తలు తెలిపారు. జై జవాన్, జై కిసాన్, జై కళాకార్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా మహతి కళాక్షేత్రంలో చేపడుతున్న అన్నమయ్య సంగీత, నృత్యోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి అన్నమయ్య వంశీయులు హరినారాయణ ఆచార్య, టీటీడీ మాజీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, రచయిత ధర్మయ్య, రాష్ట్ర రంగస్థల కళాకారుల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు మునిరత్నం ప్రధాన వక్తలుగా హాజరై ప్రసంగించారు. తిరుమల శ్రీవారి అపరభక్తుడైన అన్నమయ్య సంకీర్తనలపై సంగీతం, నృత్యోత్సవాలు చేపట్టి తద్వారా అన్నమయ్య కీర్తిని ఇనుమిడింపజేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సంగీత, నృత్య కళావికాసానికి నిరంతరం కృషి చేస్తున్న గురువులను, అలాగే అన్నమయ్య వంశీయుడు తాళ్లపాక హరినారాయణాచార్యులను ఘనంగా సత్కరించారు. సుమారు 400 మందికి పైగా కళాకారులు పాల్గొని అన్నమయ్య సంకీర్తనలను సుమధురంగా గానం, నృత్యం చేసి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో జై జవాన్, జై కిసాన్, జై కళాకార్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కేవీ.రమణరావు, కళాకారులు, గురువులు పాల్గొన్నారు.

## 29న లక్ష్మీ నరసింహ స్వామికి ప్రత్యేక అభిషేకం

**తిరుమల:** తిరుమల మొదటి ఘాట్ రోడ్డులోని నడకమార్గంలో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారికి ఈనెల 29వ తేదీన ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్తీక మాసంలో స్వాతి తిరునక్షత్రం సందర్భంగా ప్రతి సంవత్సరం ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మూలమూర్తికి శాస్త్రోక్తంగా ప్రత్యేక అభిషేకం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.